


# నీవు సిద్ధమా...?- Are You Ready...?

దేవుని పరిశుద్ధ నామమునకు మహిమ కలుగును గాక!

**మూల వాక్యము:**

యెహెజ్కేలు 38:7 నీవు సిద్ధముగా ఉండుము, నీవు సిద్ధపడి నీతోకూడ కలిసిన సమూహమంతటిని సిద్ధపరచుము వారికి నీవు కావలియై యుండవలెను.

**లెంట్ అనగా (40 రోజులు)** సిద్ధపాటుకు ఒక మంచి సమయం. సంఘమును సిద్ధపరచవలసిన సేవకులు వారు సిద్ధపడక పోగా, సిద్ధపడుతున్న అనేకులను చూచి, లెంట్ లో ఉపవాసం ఉన్నావా? మాంసం తినడం లేదా? పూలు పెట్టుకోవడం లేదా? అని హేళన చేయడం పరిపాటి అయ్యింది. లెంట్ లో ఉపవాసం ఉండాలని బైబిల్ లో ఎక్కడ రాసి ఉంది చూపించండి అనేది వీళ్ళ ప్రశ్న . సంవత్సరము పొడుగునా తినమని, త్రాగమని, సంతోషించమని ఎక్కడ రాసి ఉందో చూపించమని వాళ్లని అడగండి. దానికి సమాధానం ఉండదు. ఒకవేళ **ప్రసంగి 11:9** లో ఉంది అంటే అదే వాక్యంలోనే వీటన్నింటిని బట్టి దేవుడు నిన్ను తీర్పు లోనికి తెచ్చునని జ్ఞాపక ముంచుకొనుము అని వ్రాయబడి ఉంది . దాని సంగతి ఏంటో చెప్పమనండి. **ప్రసంగి 11:9** యౌవనుడా, నీ యౌవనమందు సంతోషపడుము , నీ యౌవనకాలమందు నీ హృదయము సంతుష్టిగా ఉండ నిమ్ము , నీ కోరికచొప్పునను నీ దృష్టియొక్క యిష్టము చొప్పునను ప్రవర్తింపుము ; అయితే వీటన్నిటి నిబట్టి దేవుడు నిన్ను తీర్పులోనికి తెచ్చునని జ్ఞాపక ముంచుకొనుము

పరిశుద్ధ బైబిల్ గ్రం థంలో సిద్ధపాటు అనేది ఒక ప్రాముఖ్యమైన ప్రక్రియ సువార్త వినని వారు వినటానికి , బాప్తిస్మ అనుభవం లేని వారు పునరుత్థాన దినం (Easter) రోజున బాప్తిస్మము పొందడానికి, ప్రభువు బల్ల అనుభవం లేనివారు క్రీస్తు రక్త మాంసంలో పాలివారు కావడానికి , పాపములో ఉన్నవారు వాటిని విడిచి పెట్టడానికి, లోకాశల చేత మునిగి తేలే వారు ఆత్మ చేత శారీరక క్రియలను చంపడానికి, మరి యౌవ్వనస్తులయితే మందిర అనుభవంలోనికి వచ్చి ప్రభువు కోసము పనిచేయడానికి, వృద్ధులయితే ప్రభువు పిలుపును అందుకొని మహిమలో ప్రవేశించడానికి, ఇంతకు మించిన శ్రేష్టమైన సమయం మరెప్పుడుందో చెప్పండి. ఇదే సిద్ధపాటు.

1. *To Answer – సమాధానం చెప్పుటకు నీవు సిద్ధమా:*

   **1 Peter(మొదటి పేతురు) 3:15** **నిర్మలమైన మనస్సాక్షి కలిగినవారై, మీలో ఉన్న నిరీక్షణను గూర్చి మిమ్మును హేతువు అడుగు ప్రతివానికిని సాత్వికముతోను భయముతోను సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండి**,మీ హృదయములయందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుడి;

2. *To Preach – సువార్త ప్రకటించుటకు నీవు సిద్ధమా:*

   **Romans(రోమీయులకు) 1:15** కాగా నావలననైనంతమట్టుకు రోమాలోని మీకును **సువార్త ప్రకటించుటకు సిద్ధముగా ఉన్నాను.**

3. *To Distribute- ఇచ్చుటకు నీవు సిద్ధమా:*

**1 Timothy(మొదటి తిమోతికి) 6:18,19** వారు వాస్తవమైన జీవమును సంపాదించుకొను నిమిత్తము, రాబోవు కాలమునకు మంచి పునాది తమకొరకు వేసికొనుచు, మేలుచేయువారును, **సత్క్రియలు అను ధనము గలవారును, ఔదార్యముగలవారును, తమ ధనములో ఇతరులకు పాలిచ్చు వారునై యుండవలెనని వారికి ఆజ్ఞాపించుము.**

4. *To do Every Good Work- ప్రతి సత్కార్యము చేయుటకు నీవు సిద్ధమా:*

**2 Timothy(రెండవ తిమోతికి) 3:16,17** దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము(ప్రతిలేఖనము దైవాదేశము వలన కలిగి) ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది.

5. *To Die – మరణించుటకు నీవు సిద్ధమా:*

**Acts(అపొస్తలుల కార్యములు) 21:13** పౌలు ఇదెందుకు? మీరు ఏడ్చి నా గుండె బద్దలు చేసెదరేల? **నేనైతే ప్రభువైన యేసు నామము నిమిత్తము యెరూషలేములో బంధింపబడుటకు మాత్రమే గాక చనిపోవుటకును సిద్ధముగా ఉన్నానని చెప్పెను.**

6. *To Meet The Lord – ప్రభువుని ఎదుర్కొనుటకు నీవు సిద్ధమా:*

**Luke(లూకా సువార్త) 12:36** తమ ప్రభువు పెండ్లివిందునుండి వచ్చి తట్టగానే అతనికి తలుపుతీయుటకు అతడెప్పుడు వచ్చునో అని **అతనికొరకు ఎదురు చూచు** మనుష్యులవలె ఉండుడి.

7. *To Enter The Glory- మహిమలో ప్రవేశించుటకు నీవు సిద్ధమా:*

**Matthew(మత్తయి సువార్త) 25:10** వారు కొనబోవుచుండగా పెండ్లికుమారుడు వచ్చెను, అప్పుడు సిద్ధపడి యున్నవారు అతనితో కూడ **పెండ్లి విందుకు లోపలికి పోయిరి;**

లెంట్ ఆచారము అని చెప్పే వాళ్లు అది ఎవరి ఆచారమో చెప్పాలి. అన్యజనుల ఆచారములను అభ్యసింపకుడి అని దేవుడు యిర్మీయా ప్రవక్త ద్వారా మనల్ని హెచ్చరించాడు. **యిర్మీయా 10:2** యెహోవా సెలవిచ్చుచున్నదేమనగా అన్యజనముల ఆచారముల నభ్యసింపకుడి, ఆకాశమందు అగపడు చిహ్నములకు జనములు భయపడును, అయితే మీరు వాటికి భయపడకుడి.

యేసు క్రీస్తు పస్కా ను ఆచరించారా? లేదా? ఆచరించమని శిష్యులకు చెప్పరా? లేదా? నేటికి మీరు ఈ క్రమాన్ని ఆచరిస్తూ ఉన్నారా? లేదా? ఇది ఆచారము కాదా? ఇది ఎవరి ఆచారము? ఆచారాన్ని అనగా క్రమాన్ని ఆసక్తితో, ఆత్మీయతతో, భయము భక్తీ తో చేయడం నేర్పించాలి కాని, ఆచారము అని ఒక్క మాటతో కొట్టి పడవేయకూడదు.




మనం ఏ దినాలలో ఉన్నాం? మారుమూల పల్లెలలో చదువు రాని వాడినడిగిన ఇది పోయే కాలమనో, యుగాంతమనో చెప్పుతున్నారు. వాక్యానుసారం ఇది ప్రభువు రాకడ దినములని జ్ఞాపకం చేసుకుందాం. ప్రభువు రాకడ దినములకు రెండు క్రొత్త పేర్లు ఉన్నాయి. **నోవాహు దినాలని, లోతు దినాలని,** అంటే పాపము విచ్చలవిడై, దేవుని ఉగ్రత మనుష్యుల పైకి వచ్చిందని మనం జ్ఞాపకం చేసుకోవాలి. **మత్తయి 24:37,38** నోవహు దినములు ఏలాగుండెనో మనుష్యకుమారుని రాకడయును ఆలాగే ఉండును. జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్లిన దినమువరకు, వారు తినుచు, త్రాగుచు, పెండ్లిచేసికొనుచు, పెండ్లికిచ్చుచు నుండిరి అని ఉంది. ప్రభువైన క్రీస్తు ఏ దినమున మీ ప్రభువు వచ్చునో మీకు తెలియదు గనుక మెలకువగా ఉండుడి అని చెప్పారు. **ఏంటి ఈ మెలకువ**?

**మత్తయి 24 :44** లో మీరనుకొనని గడియలో మనుష్యకుమారుడు వచ్చును గనుకనే మీరును సిద్ధముగా ఉండుడి అని ప్రభువు చెప్పారు. **ఏంటి ఈ సిద్ధపాటు? మత్తయి 27:32** లో అంజూరపు చెట్టును చూచి ఒక ఉపమానము నేర్చుకొనుడి. అంజూరపుకొమ్మ లేతదై చిగిరించునప్పుడు వసంత కాలము యింక సమీపముగా ఉన్నదని మీకు తెలియును అని ప్రభువు చెప్పారు. Lent అంటే వసంత కాలం. పాత ఆకులు రాలి క్రొత్త ఆకులు వచ్చే కాలం. పాత, రోత స్వభావం విడిచి నూతన స్వభావం పొందుకొనే కాలం.

**యిర్మీయా 8:20** కోత కాలము గతించియున్నది, గ్రీష్మకాలము జరిగిపోయెను, మనము రక్షణనొందకయే యున్నాము అని చెప్పుదురు అని వ్రాయబడి ఉంది. **ఏంటి ఆ కాలము? ఏంటి ఆ రక్షణ?** ఆ కాలమే Lent. సిద్ధపాటు కాలం. రెండవ రాకడ సిద్ధపాటు కాలం. కోత కాలమునకు పరిశుద్ధ గ్రంథంలో శిక్షా కాలము అని వ్రాయబడి ఉంది. ఈ రోజు క్రీస్తు చెప్పినట్లు భూమి మొత్తం కరువు కాటకాలతో, తెగుళ్ళతో, వరదలతో, ప్రకృతి విలయతాండవంతో అతలా కుతలమవుతుంది. యుగాంతం అని అందరు చెబుతూ భయపడి చస్తుంటే నీవు సిద్ధపడి, ఇతరులను సిద్ధపరచమంటే ఏం చేస్తున్నావ్? నరకంలో మండే రోజు, చుక్క నీటి కోసం అంగలార్చే రోజులు వస్తున్నాయ్ జాగ్రత్త.

**యెహెజ్కేలు 38:7** నీవు సిద్ధముగా ఉండుము, నీవు సిద్ధపడి నీతోకూడ కలిసిన సమూహ మంతటిని సిద్ధపరచుము, వారికి నీవు కావలియై యుండవలెను.

**కాబట్టి జాగ్రత్త. ప్రభువు త్వరలో రానై యున్నారు. మనమందరము మన అపవిత్రమైన జీవితాలు విడిచి, పరిశుద్ధ జీవితం అలవరచుకొని మనం సిద్ధపడి, మనతో ఉన్నవారిని సిద్ధపరచడానికి పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయం చేయును గాక! ఆమేన్.....ఆమేన్......ఆమెన్ !**